సాక్షి
నిజామాబాద్
గురువారం । 6 । జూన్ । 2024



బీజేపీకి కేసీఆర్ సరెండర్

కవిత అరెస్ట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కేసీఆర్ బీజేపీకి సరెండర్ అయ్యారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸



క్రికెట్ ఆడుతూ కుప్పకూలి..

క్రికెట్ ఆడుతుండగా గుండెపోటుతో యువకుడు కుప్పకూలి మృతి చెందిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.7 /26.6

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లగా మారుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ



ఖలీల్‌వాడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని బాలభవన్ నుంచి ర్యాలీని బుధవారం జిల్లా జడ్జి సునీత కుంచాల ప్రారంభించారు. జిల్లా కోర్టులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణ మన అందరి కర్తవ్యమన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సహాయ కార్యదర్శి పద్మావతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ గౌడ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గోదాముల్లోకి చేరిన ఈవీఎంలు

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కోసం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో వినియోగించిన ఈవీఎంలను డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాల నుంచి మంగళవారం అర్ధరాత్రి నగర శివారులోని పాంగ్రా శివారులో గల ఈవీఎం గోదాముల్లోకి చేర్చారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో భారీ భద్రత మధ్య ఈవీ ఎంలను తీసుకొచ్చి వాటికి సీల్‌వేసి భద్రపర్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను గోదాములకు చేరవేశారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే.

పకడ్బందీగా గ్రూప్‌-1 పరీక్ష


నిజామాబాద్ అర్బన్: గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కో-ఆర్డినేటర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం గిరిరాజ్ కళాశాలలో పరీక్ష నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న జరగనున్న పరీక్షల్లో పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షల్లో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని.. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్ర కారం నడుచుకోవాలని సూచించారు. పరీ క్షా సమయానికి గంట ముందు నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించాలన్నారు. అలాగే పరీక్ష ముగిసే వరకు ఎవరినీ ముందుగా బయటకు పంపవద్దని పేర్కొన్నారు.

మాక్లూర్ సొసైటీలో మరోసారి విచారణ

మాక్లూర్: మాక్లూర్ సొసైటీలో అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. గత డిసెంబర్ వరకు కొనసాగిన పాలకవర్గం మాక్లూర్ సొసైటీతో పాటు ఐదు సబ్ బ్రాంచ్‌లలో మొత్తం రూ. 70.50 లక్షల విలువైన ఎరువులను మింగేసినట్లు సమాచారం. దీనిపై ఈ నెల 2న సాక్షి దినపత్రిక 'ఎరువులు మింగేశారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘంలో విచారణ నిర్వహించారు. క్లస్టర్ అధికారి సత్యనారాయణ, మరో అధికారితో కలిసి ఎరువుల గోదాంలను తనిఖీ చేశారు. బ్రాంచ్‌ల వారీగా ఎరువుల నిల్వలపై విచారణ చేపట్టారు.

ఉత్కంఠ పోరులో చెరో సీటు

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. బరిలో బీఆర్‌ఎస్ నామమాత్ర పోటీ మాత్రమే ఇవ్వడంతో రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు హోరాహోరీ తలపడ్డాయి. చెరో సీటును గెలుచుకున్నాయి.



- నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు సెగ్మెంట్లలో బీజేపీ, మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యం
- జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఐదు సెగ్మెంట్లలో కాంగ్రెస్, రెండు సెగ్మెంట్లలో బీజేపీకి అధిక ఓట్లు
- చెరొక సీటు గెలుచుకున్న బీజేపీ, కాంగ్రెస్
- అభ్యర్థులు ఓట్లేసిన బూత్‌ల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్లపై ఆసక్తి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్లలో బీజేపీ సిట్టింగ్ ఎంపీ అర్వింద్ ఆధిక్యం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నిజామాబాద్ అర్బన్, జగిత్యాల, బోధన్ సెగ్మెంట్లలో ఆధిక్యం సాధించారు. అర్వింద్ 1,09,241 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. అర్వింద్‌కు మొత్తం 5,92,318 ఓట్లు వచ్చాయి. జీవన్‌రెడ్డికి 4,83,077 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు 1,02,406 ఓట్లు వచ్చాయి.

■ ధర్మపురి అర్వింద్ ఓటు హక్కు వినియోగించుకున్న నిజామాబాద్ అర్బన్‌లోని 32వ పోలింగ్ బూత్‌లో బీజేపీకి 182 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 405 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్‌కు 24 ఓట్లు వచ్చాయి. జీవన్‌రెడ్డి ఓటేసిన జగిత్యాలలోని 144వ బూత్‌లో బీజేపీకి 110 ఓట్లు, కాంగ్రెస్‌కు 113 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 14 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఓటేసిన నిజామాబాద్ రూరల్ సిరికొండ మండలంలోని రావుట్ల బూత్‌లో బీజేపీకి 636 ఓట్లు, కాంగ్రెస్‌కు 404 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 342 ఓట్లు వచ్చాయి.

■ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బాల్కొండ సెగ్మెంట్‌లో బీజేపీకి 85,845 ఓట్లు, కాంగ్రెస్‌కు 53,673 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 19,643 ఓట్లు వచ్చాయి. ఆర్మూర్ సెగ్మెంట్‌లో బీజేపీకి 83,668 ఓట్లు, కాంగ్రెస్‌కు 54,999 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 8,312 ఓట్లు వచ్చాయి. కోరుట్ల సెగ్మెంట్‌లో బీజేపీకి 92,656 ఓట్లు, కాంగ్రెస్‌కు 59,704 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 20,324 ఓట్లు వచ్చాయి. నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్‌లో బీజేపీకి 1,01,474 ఓట్లు, కాంగ్రెస్‌కు 56,674 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 22,590 ఓట్లు వచ్చాయి. ఇక జగిత్యాల సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 76,145 ఓట్లు, బీజేపీకి 74,298 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 16,194 ఓట్లు వచ్చాయి. నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 96,640 ఓట్లు, బీజేపీకి 80,831 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 7,124 ఓట్లు వచ్చాయి. బోధన్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 82,666 ఓట్లు, బీజేపీకి 69,472 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 7,742 ఓట్లు వచ్చాయి.

■ జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ 46,188 ఓట్ల మెజారిటీ విజయం సాధించారు. షెట్కార్ నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఆధిక్యం సాధించారు. ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రం బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ ఆధిక ఓట్లు పొందారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మూడో స్థానానికి పరిమితమయ్యారు.

■ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ ఓటు వేసిన నారాయణఖేడ్‌లోని 168వ నంబర్ బూత్‌లో కాంగ్రెస్‌కు 368 ఓట్లు, బీజేపీకి 209 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 30ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఓటేసిన జహీరాబాద్ సెగ్మెంట్ పరిధిలోని మొగడంపల్లి మండలం మాడ్గి పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్‌కు 747 ఓట్లు, బీజేపీకి 470 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 158 ఓట్లు వచ్చాయి.

■ నారాయణఖేడ్‌లో కాంగ్రెస్‌కు 78,280 ఓట్లు రాగా బీజేపీకి 58,018 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 28,194 ఓట్లు వచ్చాయి. ఆందోల్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 82,612 ఓట్లు, బీజేపీకి 66,118 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 34,186 ఓట్లు వచ్చాయి. జహీరాబాద్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 1.03,129 ఓట్లు, బీజేపీకి 67,651 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 23,018 ఓట్లు వచ్చాయి. జుక్కల్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 63,577 ఓట్లు, బీజేపీకి 61,832 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 20,747 ఓట్లు వచ్చాయి. బాన్సువాడ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 66,348 ఓట్లు, బీజేపీకి 57,459 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 21,267 ఓట్లు వచ్చాయి. ఎల్లారెడ్డి సెగ్మెంట్‌లో బీజేపీకి 79,335 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 63,446 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 20,715 ఓట్లు వచ్చాయి. కామారెడ్డి సెగ్మెంట్‌లో బీజేపీకి 85,610 ఓట్లు, కాంగ్రెస్‌కు 66,527 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 23,282 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో బీజేపీకి 6,207 ఓట్లు, కాంగ్రెస్‌కు 4,499 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 666 ఓట్లు వచ్చాయి. మొత్తం కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు 5,28,418 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌కు 4,82,230 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థికి గాలి అనిల్‌కుమార్‌కు 1,72,078 ఓట్లు వచ్చాయి.

■ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ సభ నిర్వహించినప్పటికీ ఇక్కడ బీజేపీకి ఆధిక్యం రావడం గమనార్హం. ఎల్లారెడ్డిలో బీజేపీకి 15,889 ఓట్ల ఆధిక్యత దక్కింది. స్టార్ క్యాంపెయినర్లు ఎవరూ రానప్పటికీ, గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యంతో గెలుపొందిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాత్రం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 1,745 ఓట్ల ఆధిక్యం సాధించడం విశేషం. పైగా బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ జుక్కల్ నియోజకవర్గానికే చెందినవారు కావడం గమనార్హం. పాటిల్ మద్నూర్ నుంచి విడిపోయిన డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందినవారు. 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరుపున పోటీ చేసిన పాటిల్‌కు ఉమ్మడి మద్నూర్ మండలంలో 9,000 ఓట్ల ఆధిక్యం రాగా, ఈసారి 800 మాత్రమే రావడం గమనార్హం. తాజా ఎన్నికల్లో డోంగ్లీ మండలంలో కాంగ్రెస్ 375 ఓట్ల ఆధిక్యం సాధించగా, పాటిల్ సొంత గ్రామం సిర్పూర్‌లో సైతం కాంగ్రెస్ 78 ఓట్ల ఆధిక్యం సాధించడం విశేషం. సిర్పూర్‌లో కాంగ్రెస్‌కు 426 ఓట్లు రాగా, బీజేపీకి 348 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 71 ఓట్లు వచ్చాయి.

పనుల్లో వేగం పెంచాలి

- డీఈవో దుర్గాప్రసాద్



బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో పనులు పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

మోపాల్: జిల్లాలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని, వారం రోజుల్లోపు పూర్తయ్యేలా హెచ్‌ఎంలు చొరవ చూపాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. బుధవారం నగర శివారులోని బోర్గాం(పి), కంజర్, కులాస్‌పూర్, కులాస్‌పూర్ తండా పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను ఆయన పరిశీలించారు. తాగునీటి సరఫరా, మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ సరఫరా, ఇతర మైనర్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన పనులను ప్రభుత్వం చేపడుతుందన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని, ఇంకా ఎక్కడైనా ప్రారంభం కాకపోతే స్థానిక నాయకులు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వెంటనే ప్రారంభించాలని సూచించారు. హెచ్‌ఎంలు, అధికారులు దగ్గరుండి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట బోర్గాం (పి) జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శంకర్, మిగతా హెచ్‌ఎంలు, పీఆర్ ఏఈ స్రవంతి, స్థానిక నాయకులు ఉన్నారు.

విద్యార్థుల యూనిఫాంల పరిశీలన

కంజర్, కులాస్‌పూర్‌లలో మహిళా శక్తి కుట్టు కేంద్రాలను డీఈవో బుధవారం పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల యూనిఫాంలను కుట్టే బాధ్యతను అప్పగించగా.. పలు సూచనలు చేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు యూనిఫాంలు అందించేలా చర్యలు చేపట్టాలని ఏపీఎం మోహన్‌కు సూచించారు.

61 ఏళ్లు దాటితే ఉద్వాసనే..

- సమగ్ర శిక్ష ఉద్యోగులను తొలగించాలని రాష్ట్రస్థాయి అధికారుల ఉత్తర్వులు

ఆర్మూర్: సమగ్రశిక్ష పథకంలో 61 ఏళ్లు నిండిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లో నుంచి తప్పించాలని సూచిస్తూ ఎక్స్ అఫీషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య భట్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సుమారు 22 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు వర్తింపజేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల కాంట్రాక్టు పీరియడ్ 2023–24 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 24న ముగియడంతో వారిని విధుల నుంచి తొలగించారు. తిరిగి 2024–25 విద్యా సంవత్సరానికి గాను వారి సేవలను వినియోగించుకోవడానికి అదే నెల 29న ఉద్యోగుల పనితీరు ఆధారంగా విధుల్లో చేర్చుకోవాలని సూచించారు. అయితే చాలీచాలని వేతనాలతో ప్రాజెక్టు పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రిటైర్మెంట్ అన్నది ఇప్పటి వరకు అమలు చేయలేరు. దీంతో ప్రతియేటా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ నిబంధనల ప్రకారం విధుల నుంచి తొలగించబడుతూ తిరిగి విధుల్లోకి తీసుకోబడుతున్నారు.

జిల్లాలో 910 మంది ఉద్యోగులు

జిల్లాలో సమగ్ర శిక్ష పరిధిలో సుమారు 910 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇకపై వీరందరికీ ఈ పదవీ విరమణ వయస్సు రెగ్యులర్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరహాలోనే వర్తించనుంది. కేజీబీవీల్లో బోధ న, బోధనేతర సిబ్బంది 571 మంది, యూఆర్‌ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది 10 మంది, డీపీవో సిబ్బంది 9 మంది, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు 22 మంది, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 29 మంది, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ 49 మంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్పీ) 94 మంది, డీఎస్‌ఎంటీలు, పీటీఐలు 88 మంది, మెసెంజర్లు 19 మంది, సిస్టమ్ అనలిస్ట్, ఏపీవో, అకౌంటెంట్, ఇద్ద రు డిస్ట్రిక్ టెక్నికల్ పర్సన్స్, సీజీవీలు 19 మంది, ఇద్దరు నైట్ వాచ్‌మన్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఈ తాజా ఉత్తర్వులు వర్తించనున్నాయి.

చేతి చమురు వదిలిస్తున్న వాటర్ బాటిల్

- హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చాయ్ కేఫ్‌లలో నీళ్ల బాటిళ్లు కొనాల్సిందే..
- లీటరు బాటిల్‌కు రూ. 30 నుంచి రూ. 60 వసూలు చేస్తున్న పరిస్థితి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నీళ్ల బాటిల్ కోసం చేతి చమురు వదిలించుకోవడం ఏమిటనుకుంటున్నారా..? జిల్లాలోని ఏ హోటల్‌కు వెళ్లినా మీరు ఫుడ్‌తో పాటు నీళ్ల బాటిల్ కొనాల్సిందే..! ఒకప్పుడు పెద్దపెద్ద హోటళ్లు, రెస్టారెంట్లలో ఉండే ఈ విధానం ప్రస్తుతం బేకరీలు, చాయ్ కేఫ్‌ల వరకూ పాకింది. జిల్లా కేంద్రంలో దాదాపు అన్ని హోటళ్లలో నీళ్ల బాటిల్ కొనుగోలు చేయడం తప్పనిసరి అయిపోయింది. ఈ విధానం అన్ని మండలాలకు, గ్రామాలకు సైతం విస్తరించింది. చివరకు రోడ్డు పక్కన ఉండే హోటళ్లు, దాబాల్లో సైతం ఇదే పరిస్థితి. అధిక ధరకు కొనుగోలు చేసే తాగేనీరు మాత్రమే శుభ్రమైందనే విధంగా వినియోగదారులను యాజమాన్యాలు ట్రాప్‌లో పడేయడం గమనార్హం.

■ హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, బేకరీల్లో ఆహార పదార్థాలకు చెల్లించే ధరలతో పోటీగా నీళ్ల బాటిళ్ల ధరలు అధికంగా ఉండడం గమనార్హం. టీ హోటల్‌లో చాయ్ తాగాలంటే రూ. 10 చెల్లించాల్సి వస్తే.. నీళ్ల బాటిల్‌కు మాత్రం అందుకు మూడు రెట్లు రూ. 30 చెల్లించాల్సి వస్తోంది. హోటల్ ఆధారంగా బాటిళ్ల ధరలు మారుతుండడం విశేషం. లీటరు ప్లాస్టిక్ ప్యాకేజ్డ్ వాటర్ బా టిల్‌కు రూ. 30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. అదే విధంగా కొన్ని చోట్ల 250 మి.లీ బాటిల్‌కు రూ. 10 వసూలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల 750 మి.లీ బాటిల్‌కు రూ. 25 వసూలు చేస్తున్నారు. అధికారులు స్పందించి హోటళ్లలో శుభ్రమైన తాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

■ ఇదిలా ఉండగా కేరళలో మాత్రం ఎంత పెద్ద హోటల్ అయినా.. అక్కడ తప్పనిసరిగా టేబుల్ మీద శుభ్రమైన చల్లని తాగునీటితో పాటు మెడికేటెడ్ వేడి నీటిని సైతం తప్పనిసరిగా అందుబాటులో ఉంచుతారు. ఇలా అక్కడ తాగునీటిని ఉచితంగా అందిస్తున్నారు. గోరువెచ్చని నీరు తాగితే అన్ని రకాలుగా మేలు కలుగుతుందనే నేపథ్యంలో ఈ విధానాన్ని అక్కడ అమలు చేస్తుండడం విశేషం.

■ ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాల నిబంధనలు 2011 ప్రకారం ప్రతి హోటల్ యాజమాన్యం పరిశుభ్రమైన భోజనంతో పాటుగా తాగునీరు తప్పనిసరిగా ఇవ్వాలి. తాగునీటికి అదనంగా చార్జీలు వసూలు చేయకూడదు. ఒకవేళ వసూలు చేస్తే ఆయా జిల్లాల్లో ఉన్న ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. హోటల్ నిర్వాహకులు ఇచ్చిన రశీదుతో వినియోగదారుల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేయవచ్చు. కానీ హోటళ్లలో అలా జరగడం లేదు. పరిశుభ్రమైన తాగునీరు లభించకపోవడంతో ప్రజలు తాగునీటి బాటిళ్లు తెప్పించుకుని తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కాంగ్రెస్ మత రాజకీయాలను తిప్పికొట్టారు

- ఆ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొట్లాడుతాం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- రెండోసారి ఎంపీగా గెలుపొందడంతో భారీ ర్యాలీ, సంబరాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్, వేదికపై ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో సకాంగ్రెస్ పార్టీ చేసిన మత రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టారని, ముస్లిములు తప్ప ఆ పార్టీకి ఎవరూ చెప్పుకోదగిన ఓట్లు వేయలేదని ఎంపీ అర్వింద్ ధర్మపురి విమర్శించారు. రాష్ట్రంలో ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై, మోదీ నాయకత్వంపై నమ్మకంతో బీజేపీని గెలిపించిన మహిళలు, రైతులు, యువకులు, ఎస్‌ఆర్‌ఐ సోదరులు, యువత, ప్రజలందరికీ ఎంపీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అర్వింద్ ధర్మపురి మాట్లాడుతూ ఎంపీగా తన పని నిరంతరం కొనసాగుతుందని, నిన్న గెలిచాం.. ఈరోజు నుంచి పనిలో ఉన్నానని తెలిపారు. గ్రామాలు పూర్తిగా, అర్బన్ ఏరియాలు 70శాతం బీజేపీ వైపు నిలబడ్డాయని, అందరి ఆశీర్వాదంతో విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కవిత, సుదర్శన్‌రెడ్డి ఇద్దరూ లిక్కర్ వ్యాపారులేనని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కవిత జైలుకెళ్లకపోవడం తమ బ్యాడ్‌లక్ అని పేర్కొన్నారు.

సుదర్శన్‌రెడ్డితో పైసా ప్రయోజనం లేదు

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో సమాజానికి నయాపైసా ప్రయోజనం లేదని అర్వింద్ విమర్శించారు. ఆయన ఏనాడైనా ప్రజలకు అందుబాటులో ఉన్నారా అని ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఎవరినీ సహించబోమని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై మాట్లాడడం లేదని పేర్కొన్నా రు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించి ఉద్యోగాలు కల్పించడం లేదని, చెరుకు రైతులకు పునర్వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆయన మాత్రం ఇథనాల్ ఫ్యాక్టరీలు పెట్టి రూ. వందల కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. అధికారులు, పోలీసులు, కలెక్టర్లను బెదిరించడం, మత రాజకీయాలు చేయడం, పదవిని వాడుకుని వ్యాపారాలు పెంచుకోవడం తప్ప.. ప్రజలకు ఉపయోగపడే పని చేయడం లేదన్నారు. పెట్టుబడిదారులను ప్రోత్సహించి పరిశ్రమలు ఏర్పాటు దిశగా ప్రయత్నం చేద్దామని పిలుపునిచ్చారు. కేంద్రం పథకాలు, సబ్సిడీల కోసం తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అర్వింద్ తెలిపారు. ఐదేళ్లలో చేపట్టనున్న అభివృద్ధిపై విజన్‌తో ఉన్నాని, నిజామాబాద్‌ను స్మార్ట్‌సిటీగా చేస్తానన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సుదర్శన్‌రెడ్డి ప్రోత్సహిస్తే.. తాను కేంద్రం నుంచి సబ్సిడీలు తెచ్చే బాధ్యత తనదని, టూరిజం, హెరిటేజ్, ఇతరత్ర అభివృద్ధికి తాను సిబ్బంది సవాల్ విసిరారు.

గెలుపు సంబరాలు

నిజామాబాద్‌లో రెండోసారి కాషాయ జెండా ఎగురవేయడం, కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలో రావడంపై బీజేపీ నాయకులు బుధవారం పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్వింద్‌ను సన్మానించారు. ఎంపీ అరివ్వింద్ భారీ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. డీజే పెట్టి నృత్యాలు చేశారు. మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాయకులు వడ్డి మోహన్‌రెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కోటపాటి నర్సింహనాయుడు, స్రవంతిరెడ్డి, గద్దె భూమన్న, పద్మారెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, శంకర్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



కాలువ బుంగకు మరమ్మతులు



మరమ్మతులను పరిశీలిస్తున్న ఈఈ సోలోమన్

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రం శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్టకు ఏర్పడిన బుంగను బుధవారం నీటి పారుదల శాఖ ఈఈ సోలోమన్, ఏఈ శివప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయడంతో నీటి ప్రవాహానికి కాలువ కట్టకు గండి పడిందన్నారు. దీంతో నీరు వృథాగా పోయిందన్నారు. ప్రధాన కాలువ నీటిని హెడ్ రెగ్యులేటర్ గేట్ల ద్వారా మంజీర నదిలోకి మళ్లించడంతో ప్రమాదం తప్పిందన్నారు. కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గడంతో పొక్లెయిన్ సహాయంతో కాలువ కట్టను తవ్వి బుంగను గుర్తించామన్నారు. దాదాపు 20 ఏళ్ల కిందట ఏర్పడిన బుంగ ప్రాంతంలో మరోమారు బుంగ పడిందని పేర్కొన్నారు. బుంగకు ఇసుక బస్తాలను అడ్డుకట్టగా వేయాలని నీటి పారుదల శాఖ సిబ్బందికి సూచించారు. రెండు రోజుల్లో బుంగ పూడ్చివేత పనులు పూర్తి చేసి ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసేలా చూడాలన్నారు.

సీఎంకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శుభాకాంక్షలు



సీఎంకు బొకే అందజేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

ఖలీల్‌వాడి: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపై హర్షం వ్యక్తం చేస్తూ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి టీపీసీసీ మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు పీసీసీ కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో మూడు స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో 8 స్థానాలకు చేరుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎంపీ అభ్యర్థి మల్లు రవి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, ఫహీం ఖురేషీ, ఈరవత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

7న ఉద్యోగాల కోసం ప్రత్యేక డ్రైవ్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఈ నెల 7న ఉద్యోగాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సిరిమల్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో నర్సుల కోసం విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, కార్మిక ఉపాధి శిక్షణ,రిక్రూట్మెంట్ ఏజెన్సీ ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోందని అన్నారు. అభివృద్ధి చెందిన జర్మనీ, ఇతర దేశాల్లో అర్హత కలిగిన నర్సులు, ఆరోగ్య సంరక్షణ కార్మికులకు పెద్ద డిమాండ్ ఉందని అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99088 30438,89190 47600, 70323 79066 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఇందల్వాయి: మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న ఎరువులు, రికార్డులను పరిశీలించారు. ఈ పాస్ మెషీన్ ద్వారానే ఎరువుల కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు. అనంతరం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, నల్లవెల్లి సొసైటీలలో నిల్వ చేసిన ఎరువులను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ఎ రాంబాబు, ఏఈవోలు శ్రీహరి, ప్రకాశ్, సతీశ్ ఉన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారిణి రాధ బుధవారం తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆమె సూచించారు. ఏఈవోలు వినోద్‌గౌడ్, ఆనంద్‌లు పాల్గొన్నారు.

పింఛన్ కోసం మూగ వేదన

- ఆరేళ్లుగా ఎదురు చూపులు
- పట్టించుకోని అధికారులు



బాధితురాలు శ్వేత

మాచారెడ్డి: ఆమె పుట్టు మూగ. ఐదేళ్ల వయసులో తల్లిదండ్రులను కోల్పోయింది. కొన్నేళ్లు పెద్ద నాన్న చేరదీశాడు. విధి వక్రీకరించి ఇటీవల అనారోగ్యంతో పెద్ద నాన్న బాల్ రాజు మృతి చెందాడు. అప్పటి నుంచి పెద్ద నాన్న కొడుకు బాల్ కిషన్ సంరక్షణలో ఉంటోంది. బాల్ కిషన్ కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడి అవిటివాడయ్యాడు. వివరాలు.. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన నక్క లలిత, వీరయ్యల కూతురు శ్వేత(28) పుట్టు మూగ. తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత పెద్ద నాన్న బాల్ రాజు శ్వేత పేరిట పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. అధికారుల తప్పిదం వల్ల సదరం క్యాంపు ధ్రువ పత్రంలో శ్వేత బదులు చైతన్య అని నమోదైంది. దాంతో కొద్ది రోజులు పింఛన్ ఆగిపోయింది. కలెక్టర్ చొరవతో పేరు మార్పిడి చేశారు. అప్పటి నుంచి ఫించన్ వచ్చింది. ఉన్నట్టుండి ఆరేళ్లుగా పింఛన్ రాక ఆ మూగ తల్లి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్వేతకు పింఛన్ మంజూరు చేయించాలని ఆమె సోదరుడు బాల్ కిషన్ వేడుకుంటున్నాడు.

18 ఎన్నికలు.. 9 మంది ఎంపీలు

- హ్యాట్రిక్ కొట్టిన హరీశ్‌చంద్ర, రాంగోపాల్‌రెడ్డి
- మూడు సార్లు గెలుపొందిన గంగారెడ్డి
- రెండు సార్లు విజయం సాధించిన ముగ్గురు
- ఒకేసారి ఎంపీ పదవితో సరిపెట్టుకున్న ముగ్గురు



మోర్తాడ్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి ఇప్పటి వరకు 18సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో తొమ్మిది మంది ఎంపీలుగా గెలుపొందారు. కాగా ఈ సారి నిర్వహించిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ రెండో సారి విజయం సాధించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. హెచ్ హరిచంద్ర తొలిసారి హ్యాట్రిక్ సాధించగా.. ఎం రాంగోపాల్‌రెడ్డి హ్యాట్రిక్ కొట్టారు. ఇక జి గంగారెడ్డి మూడుసార్లు గెలుపొందారు. టి బాలాగౌడ్, మధుయాష్కీగౌడ్‌లు మాత్రం రెండుసార్లు ఎంపీగా ఎంపికయ్యారు. ఎం నారాయణరెడ్డి, జి ఆత్మచరణ్‌రెడ్డి, కల్వకుంట్ల కవిత ఒకేసారి పదవి చేపట్టారు. మధుయాష్కీ తర్వాత రెండోసారి ఎంపీగా కవిత తన అదృష్టాన్ని పరీక్షించుకోగా బీజేపీ అభ్యర్థి అర్వింద్ చేతిలో ఓటమిపాలయ్యారు. మూడోసారి పోటీ చేయాల్సి ఉన్నా లిక్కర్ కేసులో జైలు పాలుకావడం, ఇతర కారణాలతో పోటీకి దూరంగా ఉన్నారు. రెండోసారి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన సిట్టింగ్ ఎంపీ అర్వింద్ కాంగ్రెస్ అభ్యర్థిపై ఘన విజయం సాధించి రెండోసారి గెలిచిన వారి జాబితాలో చేరారు.

అర్వింద్‌తోనే బీజేపీ కల సాకారం..

నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని దక్కించుకోవడానికి బీజేపీ 1991 నుంచి పోటీ చేస్తూనే ఉంది. 18 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 2019లో అర్వింద్ ఎంపీగా గెలవడంతో బీజేపీకి ఈ స్థానంపై పట్టు లభించినట్లయింది. బీజేపీ ఒంటరిగా పోటీ చేయడంతో పాటు టీడీపీతో జతకట్టి ఆ పార్టీకి ఒకసారి మద్దతు ఇవ్వడం, మరోసారి పొత్తులో సీటు దక్కించుకున్నా ఎంపీగా పోటీ చేసినవారు గెలువలేదు. 2019 ఎన్నికల్లో సింగిల్‌గానే బీజేపీ పోటీ చేయడం దేశమంతటా మోదీ ప్రభంజనం ఏర్పడటంతో ఆ పార్టీలో ఉన్న అర్వింద్ గెలుపొందారు.

ఆర్మూర్ అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు భాగస్వాములు కావాలి



ఎన్‌ఆర్‌ఐలతో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

- అమెరికాలో ఎన్‌ఆర్‌ఐలతో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



వేంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్ అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లోని శ్రీ వేంకట సత్యనారాయణ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐలతో సమావేశమై మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరిస్తున్న తరుణంలో దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు కలిసి రావాలని కోరారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

హన్మాజీపేట్‌లో ప్రత్యేక పారిశుధ్య పనులు



డ్రైయినేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్‌లో జిల్లా వైద్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు, వైద్య సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించారు. గ్రామ ప్రజలకు విష జ్వరాలు రావడంతో 'మంచం పట్టిన హన్మాజీపేట్'అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వైద్యశాఖ అధికారులు తగు చర్యలు వెంటనే చేపట్టాలని స్థానిక అధికారులు, సిబ్బందిని బుధవారం ఆదేశించారు. గ్రామంలో విష జ్వరాలు పూర్తిగా తగ్గే వరకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. జ్వరాలు ప్రబలడానికి గల కారణాలను జీపీ కార్యదర్శి రాజేశ్ సిబ్బందితో కలిసి అన్వేషించి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలోని మురికి కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేపడుతున్నారు. మురికి కాలువల పక్కనే ఉన్న పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు హెచ్‌ఈవో సాయిలు పేర్కొన్నారు.

బీజేపీకి కేసీఆర్ సరెండర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- బీజేపీకి ఓటేయాలని బీఆర్‌ఎస్ బహిరంగ ప్రచారం
- ఐదేళ్లలో అర్వింద్ ఏం చేస్తారో చెప్పాలి
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కవిత అరెస్ట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వెలుగు చూస్తున్న స్కాముల నుంచి మాజీ సీఎం కేసీఆర్ తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు బీజేపీకి సరెండర్ అయ్యారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీకి ఓటేయాలని బహిరంగ ప్రచారం చేయడమే అందుకు నిదర్శనమన్నారు. రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపతిరెడ్డి మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌లో ప్రధాన పాత్ర కేసీఆర్, కేటీఆర్, సంతోష్‌రావు ఉందని విచారణలో తేలిందని, వాటి నుంచి తప్పించుకునేందుకే బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఓట్లు మొత్తం బీజేపీకి మళ్లాయని, అందుకే జిల్లాలో జీవన్‌రెడ్డి లక్ష ఓట్లతో ఓడిపోయారన్నారు. బీఆర్‌ఎస్ మూతపడ్డ సంస్థ అని, అందులో ఉన్న ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

మత రాజకీయాలు మానుకోవాలి

బీజేపీ నాయకులు ఇకనైనా మతం, మందిరం పేరుతో రాజకీయాలు మానుకోవాలని, ప్రజలను మోసం చేయడం ఆపాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఐదేళ్లలో ఎంపీగా అర్వింద్ ఏం చేస్తారో చెప్పాలన్నారు. పసుపు బోర్డు కేవలం పేపర్‌కే పరిమితమైందని నిలదీస్తే.. ఎన్నికల సమయంలో ఇందూరులోనే పెడతామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, నాయకులు అగ్గు బోజన్న, నవీన్ గౌడ్, బాల్‌రాజ్, సిరికొండ జెడ్పీటీసీ మాన్‌సింగ్, డీసీసీబీ డైరెక్టర్ గొర్కంటి లింగం, గంగాప్రసాద్, కొర్వ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



జల్దిపల్లిలో ఎగిరిపోయిన ఇంటిపై రేకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో బుధవారం మధ్యాహ్నం పలు గ్రామాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. జల్దిపల్లి, రాంపూర్, భవానిపేట, మెంగారం, అయ్యపల్లి, శెట్పల్లి, పొల్కంపేట, కన్నాపూర్ తదితర గ్రామాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో ఆయా గ్రామాల్లో ఇళ్లపై రేకులు గాలికి లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. రాంపూర్ గ్రామానికి చెందిన గొడ్డంన్ల హన్మంతుకు చెందిన 3 మేకలు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాయి. రూ. 40 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పొల్కంపేట గ్రామంలో బండారు వెంకటరెడ్డి ఇంటి ముందు వేప చెట్టు ఈదురు గాలులకు నేలకొరగడంతో చెట్టుతో పాటు రెండు విద్యుత్ స్తంభం విరిగి పడిపోయాయి. చెట్టు కింద నిలిపిన ద్విచక్ర వాహనం ధ్వంసమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామాల్లో అధికారులు సందర్శించి ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని కోరారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.



పొల్కంపేటలో విరిగిపడిన స్తంభం



రాంపూర్‌లో మృతి చెందిన మేకలు

పర్యావరణ కాలుష్యంతోనే వ్యాధులు



ర్యాలీని ప్రారంభిస్తున్న తుకారాం రాథోడ్

- జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్



సదస్సులో మాట్లాడుతున్న వైద్యశాఖ అధికారి

నిజామాబాద్‌నాగారం: పర్యావరణ కాలుష్యంతోనే వ్యాధుల విజృంభణ జరుగుతుందని జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని దుబ్బా పట్టణ పీహెచ్‌సీలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరూ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వీధుల గుండా తిరుగుతూ పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే అనర్థాలపై నినాదాలు చేశారు. మనభూమి–మన భవిష్యత్తు, పచ్చని చెట్లు–ప్రగతికి మెట్లు లాంటి నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ కాలుష్యంతో అనేక వ్యాధులు సంభవిస్తాయన్నారు. వాటి నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కాలనీల్లో నీటి నిల్వలను తొలగిస్తూ దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, ఘన్పూర్ వెంకటేశ్వర్లు, సలీం, వెంకట్ రవి, నాగరాజు, స్వామి, శ్రీనివాస్, గంగాధర్, శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ ఉమాదేవి

నిజామాబాద్‌నాగారం: అమెరికాలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు లో భారతదేశం తరఫున జీజీహెచ్ సీనియర్ రెసిడెంట్(పాథాలజీ) డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు. కాలిఫోర్నియాలో నిర్వహించిన 245వ సమావేశంలో పలు అంశాలపై అంతర్జాతీయ నిపుణులతో చర్చించారు. అలాగే తాను పరిశోధించిన రెండు అంశాలను ఆమె సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, డిప్యూటీ సూపరింటెండెంట్ వీవీరావు, డాక్టర్ ఇమ్రాన్ అభినందనలు తెలిపారు.





సమ్మేళనంలో పాల్గొన్న తొర్తి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ,కిసాన్‌నగర్‌లో..

'అపూర్వ' సమ్మేళనం

మోర్తాడ్ మండలంలోని తొర్తిలో జెడ్పీహెచ్‌ఎస్ 2006–07కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు ఒకేచోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాల 2005–06కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు.

–మోర్తాడ్/ బాల్కొండ

సరదగా చేపల వేట



వేసవి సెలవుల్లో ఉన్న చిన్నారులు తమ కాలక్షేపాన్ని సరదాగా గడుపుతున్నారు. కొందరు ఈతకొలనుల్లో ఈత నేర్చుకుంటుంటే మరికొందరు పిల్ల కాలువలు, వాగుల్లో తమదైన శైలిలో చేపలు పడుతూ సంబుర పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రీనగర్‌లో ఉన్న కాలువలో నీరు తక్కువగా ఉండడంతో కొందరు చిన్నారులు చీరతో చేపలు పడుతున్నారు. చిన్నారులు సంతోషంగా గడుపుతున్న దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ - నిజామాబాద్

మాయమాటలు చెప్పి బంగారం అపహరణ

కామారెడ్డి క్రైం: ఓ మహిళకు మాయమాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు అపహరించాడు ఓ గుర్తు తెలియని దుండగుడు. ఈ ఘటన కామారెడ్డిలోని దేవునిపల్లి ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌కు చెందిన మంచాల సత్తవ్వ(55) దేవునిపల్లి ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చి తన అవసరం నిమిత్తం రూ.2 వేలు డబ్బులు డ్రా చేసుకుంది. తిరిగి రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా వీఆర్‌కే కళాశాల సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెను అటకాయించాడు. మెడలో బంగారం గొలుసు వేసుకుని వెళ్లడం ప్రమాదకరమని, తీసి పర్సులో పెట్టుకుని వెళ్లమని సలహా ఇచ్చాడు. అతడు చెప్పినట్లుగా సత్తెవ్వ తన గొలుసును మెడలోంచి తీసి పర్సులో పెట్టుకోబోయింది. ఎలా పెట్టుకోవాలో తాను చూయిస్తానంటూ చేతిలోంచి గొలుసును, పర్సును సదరు వ్యక్తి లాక్కున్నాడు. పర్సులో బంగారం గొలుసు పెట్టి ఓ టవల్‌లో చుట్టినట్లు నమ్మించి ఇచ్చాడు. కొద్ది దూరం వెళ్లాక సత్తవ్వకు అనుమానం వచ్చి టవల్ తీసి చూసింది. దీంతో పర్సులో గొలుసు లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు



బాలుడికి చికిత్స అందిస్తున్న సిబ్బంది

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో ఉన్న ఓ హోటల్‌లో చాయ్ చేసే బ్లోయర్ ద్వారా విద్యుత్‌షాక్ రావడంతో బాలుడికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. జవహర్ అనే వ్యక్తి కొండాపూర్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం హోటల్‌లో అతని కుమారుడు రాహుల్ చాయ్ చేసేందుకు వినియోగించే విద్యుత్ ద్వారా నడిచే బ్లోయర్‌ను ఆన్ చేశాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రాజు ప్రాథమిక చికిత్స చేశాడు. అనంతరం 108 అంబులెన్స్‌లో బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది కిషన్ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

భీమ్‌గల్: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పురాణిపేట్‌లో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లెల నడ్పి నర్సయ్య(76)కు కొంత కాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదు. మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రించిన నర్సయ్య ఉదయం లేచి చూసే లేకపోవడంతో కుటుంబీకులు గాలించగా గ్రామంలోని రోడ్డుపక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

9న 144 సెక్షన్ అమలు

ఖలీల్‌వాడి: జిల్లాలో ఈ నెల 9న గ్రూప్–1 పరీక్ష ఉన్నందున 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ కల్మేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో గ్రూప్–1 పరీక్షా కేంద్రాలు 41 ఉన్నట్లు వెల్లడించారు. ఈ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరూ గుంపులు గుంపులుగా ఉండొద్దని అన్నారు. జిరాక్స్ సెంటర్లు సైతం మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సీపీ పేర్కొన్నారు.

క్రికెట్ ఆడుతూ.. గుండెపోటుతో కుప్పకూలి..

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిన యువకుడు



విజయ్ (ఫైల్)

ఖలీల్‌వాడి: క్రికెట్ ఆడేందుకు వెళ్లిన ఓ యువకుడు ఆట మధ్యలోనే గుండెపోటుతో కుప్పకూలిన ఘటన నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అమ్మవెంచర్‌లో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన విజయ్(30) తన స్నేహితులతో కలిసి అమ్మవెంచర్‌లో ఉన్న క్రికెట్ మైదానానికి వచ్చాడు. అక్కడ క్రికెట్ ఆడుతుండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన స్నేహితులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. విజయ్ మృతితో కుటుంబీకులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విషయమై నాలుగో టౌన్ ఎస్సై సంజీవ్‌కు వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.